
ప్రజాశక్తి
గురువారం 2 జనవరి 2025



గురుకులాల్లో డెప్యుటేషన్లు రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల డెప్యుటేషన్ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను రద్దు చేస్తూ గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. 45 రోజులుగా గిరిజన సంక్షేమ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అయితే బుధవారం నుంచి సమ్మె విరమిస్తున్నట్లు గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం ప్రకటించడంతో డెప్యుటేషన్ ఉత్తర్వులు రద్దు చేసినట్లు డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

జూనియర్ కళాశాలల్లో
రేపటి నుంచి మధ్యాహ్న భోజనం

5532 మంది విద్యార్థులకు లబ్ధి



ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ప్రభుత్వ కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక జీవోను విడుదల చేసింది. విద్యార్థుల చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. 2025 జనవరి 1 నుంచి 475 జూనియర్ కాలేజీల్లో కొత్త సంవత్సరం కానుకగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ పథకానికి మొత్తం రూ. 115 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో జనవరి 3 తేదీ నుంచి జూనియర్ కళాశాల లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ విద్యా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. మన్యం జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో మొదటి ఏడాది విద్యార్థులు 2980మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2552 మంది చదువుతున్నారు. మొత్తంగా 5532 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా మధ్యాహ్న భోజన పథకం అమలు కానుంది. మొత్తం 18 కళాశాలలకు గాను 9 కళాశాలల్లో అక్షయపాత్ర ఫౌండేషన్, మిగిలిన 9 కళాశాలల్లో ఆయా కళాశాలలకు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పథకం నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జి గ్రూపుల ద్వారా భోజనం సిద్ధం చేయనున్నారు.

డ్రాపౌట్లను తగ్గించడమే లక్ష్యం

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్లో హాజరు శాతాన్ని మెరుగుపరచడం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతుంది. అదే విధంగా పనితీరు ఆధారంగా ప్రభుత్వ విద్యా సంస్థలకు రేటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పేదరికం కారణంగా పదో తరగతి తర్వాత విద్యార్థులు ఇంటర్ చదువుకు దూరమవుతున్న తీరును ప్రభుత్వం పరిశీలించి, విద్యార్థులు ఇంటర్‌తో పాటు ఉన్నత చదువులు చదివేలా ప్రభుత్వం ప్రోత్సహించడం లో భాగంగా భోజన పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించింది.

వెనుకబడిన విద్యార్థులపై పర్యవేక్షణ

ఇంటర్‌లో వెనుకబడిన విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే చదవడంలో వెనకబడిన విద్యార్థులను పర్యవేక్షించేందుకు కళాశాలల లెక్చరర్లు, సిబ్బందిని కేర్‌టేకర్లుగా నియమించాలని అధికారులను ఆదేశించారు.

మెనూ ఇలా...

సోమవారం : ఉడికించిన గుడ్డు/వెజిటబుల్ పలావు, కోడిగుడ్డు కూర, వేరుశనగ చిక్కీ

మంగళవారం : ఉదయం రాగిజావ, మధ్యాహ్నం చింతపండు పులిహోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు.

బుధవారం : వెజిటేబుల్ రైస్, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరు శనగ చిక్కీ.

గురువారం : ఉదయం రాగిజావ, మధ్యాహ్నం సాంబార్ బాత్ / లెమన్ రైస్, టొమాటో పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు.

శుక్రవారం : అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, వేరుశనగ చిక్కీ.

శనివారం : ఉదయం రాగిజావ, మధ్యాహ్నం ఆకుకూరతో చేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్.

అమలుకు సర్వం సిద్ధం



జిల్లాలో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుకు చర్యలు తీసుకున్నాం. ఈ నెల 3 నుంచి జిల్లాలో అమలు జరుగుతుంది. పేద, సామాన్య విద్యార్థులను ప్రోత్సహించి ఉన్నత చదువులకు ఆటంకం లేకుండా చేయడమే ఈ పథకం లక్ష్యం.

- మంజుల వీణ, డివిఇఒ

నూతన సంవత్సర సందడి

- మంత్రికి శుభాకాంక్షలు చెప్పిన అధికారులు
- ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద కోలాహలం

ప్రజాశక్తి - పార్వతీపురం

నూతన సంవత్సరం ప్రారంభదినం సందర్భంగా జిల్లాలోని ప్రముఖుల నివాసాలు బుధవారం సందడిగా కనిపించాయి. అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలంతో హడావుడి కనిపించింది. రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి క్యాంపు కార్యాలయంలో కొత్త సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి సంధ్యారాణికి శుభాకాంక్షలు చెప్పడానికి జిల్లా అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి, ఎఎస్పీ అంకిత సురానా, అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్‌తో పాటు రెండు జిల్లాల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులు

ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను బుధవారం క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కెఆర్‌ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, డ్వామా, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యంనాయుడు, ఎం.ఎన్.రాణి, వ్యవసాయ, పశు సంవర్థక, మత్స్య శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, డా.ఎస్.మన్మధరావు, వి.తిరుపతయ్య, పీఆర్, ఆర్.డబ్ల్యూ.ఎస్, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు వి.వి.నగేష్ బాబు, ఒ.ప్రభాకరరావు, ఆర్.అప్పల నాయుడు, వైద్యఆరోగ్య శాఖాధికారులు డా. విజయపార్వతి, డా. ఎం.వినోద్ కుమార్, డా.టి.జగన్మోహనరావు, జిల్లా విద్యా శాఖాధికారి డా. ఎన్.తిరుపతినాయుడు, ఇతర జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



మంత్రి సంధ్యారాణికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌పి మాధవరెడ్డి





కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జెసి, డిఆర్‌ఒ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది; ఎస్‌పికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎఎస్‌పి అంకిత సురానా

3న జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 3న పార్వతీపురం మన్యం జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్) డివిఎంఎం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డిఇఒ ఎన్.తిరుపతినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లావ్యాప్తంగా ఉన్న 15 మండలాల నుంచి ఎంపికైన దాదాపు 45 సైన్స్ ప్రోజెక్టులను ప్రదర్శిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇందులో సైన్స్ క్విజ్ పోటీలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. కావున సైన్స్ ఎగ్జిబిషన్‌లో సరికొత్త విద్యా, వైజ్ఞానిక అంశాలను ప్రదర్శించేందుకు సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సైన్స్ ఎగ్జిబిషన్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఇఒ కోరారు.

న్యూ ఇయర్ కిక్

- కొత్త సంవత్సరాన తప్పతాగిన మందుబాబులు
- ఒక్కరోజే రూ.9.37 కోట్ల మద్యం విక్రయం
- క్రయ, విక్రయాలకు రాత్రి ఒంటి గంట వరకు అనుమతి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! ఆ ఒక్కరోజే రూ.9.37కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. అదును చూసి పదును పెట్టాలన్నట్టుగా ప్రభుత్వం కూడా మందుబాబులు, సరదా సందళ్లను ఆసరా చేసుకుని విక్రయాలకు సమయాన్ని పొడిగించింది. నూతన సంవత్సరానికి స్వాగతం పలికే పేరుతో డిసెంబర్ 31వ తేదీన జనం అర్ధరాత్రి వరకు వేచివుంటారన్న సంగతి తెలిసిందే. ఈ పేరుతో అప్పటి వరకు కాలక్షేపం చేయడం, మద్యం ప్రియులు ఫుల్ జోష్‌తో పూటుగా తాగడం కూడా పరిపాటిగా మారిపోయింది. ఈ ఏడాది ఇటువంటి సంస్కృతి మరింతగా పెరిగిపోయింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో రూ.9.37కోట్ల మద్యాన్ని సేవించడం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. మద్యం దుకాణాల్లో నిరంతరం అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులో ఉంటాయి. కానీ, మంగళవారం ఒక్కరోజే నెల్లిమర్లలోని ఎపి బేవరేజెస్ డిపో నుంచి 6.50కోట్ల మద్యాన్ని దుకాణదారులు తీసుకెళ్లారట. మిగిలిన మద్యం అప్పటికే దుకాణాల్లో ఉన్న స్టాక్ అని అర్థం చేసుకోవచ్చు. మొత్తం సేల్ అయిన మద్యంలో జిల్లాల వారీగా పరిశీలిస్తే విజయనగరం జిల్లాలో అత్యధికంగా రూ.7.21కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.2.16కోట్ల మద్యం ఉన్నట్టుగా ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులోనూ విజయనగరం పట్టణంలో ఎక్కువగా మద్యం విక్రయాలు జరిగాయి. ఆ తరువాత స్థానాల్లో పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, పాలకొండ, రాజాం, నెలిమర్ల, గజపతినగరం, ఎస్.కోట తదితర పట్టణ కేంద్రాలు ఉన్నాయి. దాదాపు అన్ని దుకాణాలూ మంగళవారం ఉదయం నుంచే మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. సాయంత్రం అయ్యేసరికి కొన్ని దుకాణాల్లో క్యూలైన్లు, తోపులాటలు వరకు వచ్చింది. రాత్రి 9గంటలకు మూసేయవాల్సిన దుకాణాలను అర్ధ రాత్రి ఒంటిగంట వరకు తెరుచుకునేందుకు సాక్షాత్తు ప్రభుత్వమే అవకాశం ఇవ్వడంతో అప్పటి వరకు విక్రయాలు కొనసాగాయి. మద్యం విక్రయాలను ప్రభుత్వం ప్రధాన ఆదాయ వనరుగా మారడంతో క్రయ, విక్రయాలకు బార్లు తెరించిందని పలువురు విమర్శిస్తున్నారు.

మందుబాబు హల్‌చల్
విద్యుత్తు తీగలపై నిద్ర

ప్రజాశక్తి -పాలకొండ

మండలంలోని ఎం.సింగుపురం గ్రామానికి చెందిన బి.వెంకటరమణ తప్పతాగి మద్యం మత్తులో మంగళవారం సాయంత్రం గ్రామంలో హల్‌చల్ చేశాడు. పూటుగా మద్యం సేవించి విద్యుత్ స్తంభం ఎక్కి ఏకంగా విద్యుత్ తీగల మీద పడుకున్నాడు. స్తంభం ఎక్కుతుండగా స్థానికులు గుర్తించి వెంటనే లైన్‌మెన్ సూర్యారావుకు సమాచారం అందించారు. దీంతో ఆయన వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. తరువాత స్థానికులు ఆయనను కిందకు దించారు. వెంకటరమణ తల్లికి సామాజిక పింఛను అందడంతో తల్లితో గొడవ పడి ఆమె వద్ద డబ్బులు తీసుకుని వెళ్లి పూటుగా మద్యం సేవించాడని స్థానికులు చెప్తున్నారు. వెంకటరమణ కూడా స్థానికంగా విద్యుత్ పనులు చేస్తూ గ్రామంలో ఉంటున్నాడు.



విద్యుత్తు తీగలపై నిద్రపోతున్న మందుబాబు

సంక్రాంతి సరుకులు లేనట్టే!

- ప్రభుత్వ కానుకలపై ప్రజల్లో ఆశలు
- నేటికీ ప్రకటించని సర్కారు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చౌక ధరల దుకాణాల ద్వారా త్వరలో రానున్న సంక్రాంతికి ప్రత్యేక సరుకులు లేనట్టే. దీంతో, రాష్ట్ర వ్యాప్తంగా 1,48,5,194 మంది, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 8,63,007 మంది తెల్లరేషన్‌కార్డుదారులు నిరాశ చెందుతున్నారు. క్రిస్మస్ నేపథ్యంలోనూ ప్రత్యేక సరుకులు అందుబాటులోకి తేకపోవడంతో ఇక నుంచి సంక్రాంతి, రంజాన్ పండగలకు అటువంటి ఆశపెట్టుకోనక్కర్లేదని అర్థమౌతోంది. పండగ నేపథ్యంలో ప్రత్యేక సరుకుల విషయమై ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం లేదని సివిల్ సప్లయి అధికారులు కూడా స్పష్టం చేస్తున్నారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుకలు, రంజాన్ తోఫా పేరిట బియ్యం, కందిపప్పుతోపాటు అర కేజీ బెల్లం, కేజీ పంచదార, కేజీ గోదుమపిండి, లీటరు ఆయిల్ ప్యాకెట్, నెయ్యి వంటివి అందజేసేది. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని పూర్తిగా పక్కనబెట్టింది. దీంతో, గడిచిన ఐదేళ్లపాటు సిఎం చంద్రబాబు (నాడు ప్రతిపక్ష నేత హోదాలో) సంక్రాంతి సీజన్‌లో జగన్ ప్రభుత్వం సంక్రాంతి సరుకులు కూడా ఇవ్వలేదని, తాను అధికారంలో ఉన్నన్నాళ్లూ సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు ఇచ్చేవాడినని పదేపదే విమర్శలు చేస్తుండేవారు. దీంతో, ఈ అంశాన్ని ఎన్నికల హామీలో పెట్టనప్పటికీ, సరుకులు ఎప్పటి మాదిరిగానే ఇస్తారనే దీమాతో జనం ఇప్పటి వరకు ఉన్నారు. కానుకల విషయమై ఇప్పటికీ ఉలుకూ పలుకూ లేకపోవడం, వారం రోజుల క్రితం జరిగిపోయిన క్రిస్మస్ సందర్భంగాను అటువంటి సంప్రదాయం కనిపించకపోవడంతో తెల్లరేషన్ కార్డుదారుల ఆశలు ఆవిరవుతున్నాయి.

విజయనగరం జిల్లాలో 5,81,728 మంది తెల్లరేషన్‌కార్డుదారులు, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,81,279 మంది కార్డుదారులు ఉన్నారు. 2014నాటికి ముందు ఏ ప్రభుత్వం ఉన్నా సంక్రాంతి సందర్భంగా కనీసం ఆయిల్, బెల్లం అయినా ఇచ్చేవారని, ఈసారి గత ప్రభుత్వం మాదిరిగానే మొత్తానికి ఎసరు పెట్టిందని చర్చించుకుంటున్నారు. అసలే నూనె, పప్పు దినుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా రైతు కుటుంబాలకు వ్యవసాయ పెట్టుబడి పెరిగింది. ఎన్నికల హామీలో భాగంగా చెప్పిన వ్యవసాయ పెట్టుబడి రూ.20వేలు ఇవ్వలేదు. ఈ నెలలో కురిసిన ఎడతెరిపిలేని వర్షాల బారి నుంచి చేతికందిన వరి, తదితర పంటను కాపాడుకునేందుకు రైతులు అదనపు పెట్టుబడి పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మినుములు, పెసలు వంటి అపరాల పంటలు దెబ్బతిన్నాయనే బాధల్లో రైతాంగం ఉంది. మరోవైపు వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలకు పనిలేకుండా పోయింది. గడిచిన రెండదు నెలలుగా విద్యుత్ ఛార్జీల భారం పెరిగింది. ఇదే భారంతో విజయనగరం జిల్లా లోని గడిచిన ఆరు నెలల్లో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు తమ ఉత్పత్తిని తగ్గించుకోవడంతో ఆ మేరకు వాటిలో పనిచేసిన కార్మికులు జీవనోపాధి కోల్పో యారు. ఇటువంటి పరిస్థితుల్లో సంక్రాంతికి ఉచిత సరుకులు ఇవ్వకపోవడం బాధాకరమని జనం చర్చించుకుంటున్నారు.

కురుపాంలో ఫ్లెక్సీ రగడ

ప్రజాశక్తి - కురుపాం

దశాబ్దాలుగా కురుపాం రాజకీయాలు ఎప్పుడూ హుందాగా నడుస్తూ వచ్చాయి. గత రెండు ధఫాల ఎన్నికలు (2019, 2024) ఎన్నికల సమయంలో చిన్న చిన్న సంఘటనలు చోటు చేసుకున్నప్పటికీ ఎలాంటి విద్వేషాలు చోటు చేసుకోలేదు. ఇటీవల వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు, క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మెయిన్ రోడ్డులో సర్పంచ్ సుజాత, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సుజాత, జడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్ , శెట్టి నాగేశ్వరరావు తదితరులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అలాగే ధూళికేశ్వర ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఎంపిటిసి సభ్యులు బంగారు నాయుడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించి ధ్వంసం చేశారు. దీనిపై వైసిపి నాయకులు, ఎంపిపి శెట్టి పద్మావతి, సర్పంచ్ సుజాత, జడ్పీటీసీ సుజాత మాట్లాడుతూ ప్రజల్లోకి వెళ్లడానికి ధైర్యం సరిపోని వాళ్లు ఇలా ధైర్యంగా ప్రజల్లో ఉండే మా ఫ్లెక్సీలను చించేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కటౌట్లు చూసి ఇంత భయపడతారా..? కాలం ఎళ్లకాలం ఒకేలా ఉండదు. ఈ పిరికిపంద చర్యలకు పాల్పడింది ఎవరో... అన్నీ మాకు తెలుసునని, గత ఐదేళ్లు తాము రాజకీయాలను చాలా హుందాగా నిర్వహించామని ఇలాంటి దిగజారుడు చర్యలకు ఏనాడూ పూనుకోలేదని అన్నారు. రాజకీయ ప్రత్యర్థుల పట్ల అమర్యాదగా ఏనాడూ ప్రవర్తించలేదు. ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినా ఈరోజుకి ప్రజల్లో తలెత్తుకుని ధైర్యంగా తిరుగుతున్నామంటే ఆ హుందాతనమే కారణం అన్నారు. ఫ్లెక్సీలని చించేయగలరేమో కానీ మేము చేసిన మంచిని చెరిపేయలేరని, సరైన సమయంలో దీనికి మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. పూర్తి ఆధారాలతో ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న కురుపాంలో ప్రతిపక్ష వైసిపి, అధికార టిడిపిల పార్టీల మధ్య నెలకొన్న ఫ్లెక్సీ చించివేత రగడ ఎక్కడకు దారితీస్తుందోననీ కురుపాం ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



మెయిన్‌రోడ్డుపై చించేసిన వైసిపి ఫ్లెక్సీ

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


అశోక్‌గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సంధ్యారాణి


మాజీమంత్రి శత్రుచర్లకు కేక్ తినిపిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి


పార్వతీపురం ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు


పాలకొండ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


సాలూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర


సీతంపేటలో ఐటిడిఎ పిఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు


సీతానగరంలో ఎంపిపి రమణమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు


జర్జాపు సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకులు


నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పార్వతీపురం పట్టణ సిఐ


కురుపాంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు వీరేష్ చంద్రదేవ్


టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సూర్యయాదవ్


గుమ్మలక్ష్మీపురం పాఠశాలలో నూతన సంవత్సర వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు


సబ్‌కలెక్టర్‌కు ఆయన చిత్రాన్ని అందజేస్తున్న డ్రాయింగ్ టీచర్ శ్రీనివాసరావు

పిఒకు చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నూతన సంవత్సరం సందర్భంగా సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ చిత్రాన్ని జియమ్మ వలస మండలం రావాడ రామభద్ర పురం పాఠశాలలో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు గీసి అందజేశారు. పిఒ అశుతోష్ శ్రీవాస్తవ్ చిత్రాన్ని పెన్సిల్‌తో వేసి ప్రధానోపా ధ్యాయులు బి.శ్రీనివాసరావు తో కలిసి అందజేశారు. చిత్రాన్ని చూసిన పిఒ డ్రాయింగ్ టీచర్ ప్రతిభకు అభినందించారు.

మొదటి సంతకాల అమలుకు పోరాటం

ప్రజాశక్తి - పార్వతీపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేసిన డిఎస్సీ నోటిఫికేషన్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మొదటి సంతకం చేసిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం అమలు కోసం కొత్త సంవత్సరంలో పోరాడనున్నట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ చెప్పారు. నూతన సంవత్సరంలో ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం గిరిజన సంఘాలతో కలిసి పోరాడనున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లికి వందనం కింద విద్యార్థులకు ఆర్థిక సహాయం అమలు చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.


వికలాంగులకు దుప్పట్లు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వికలాంగులకు ఆర్యవైశ్య సంఘం సౌజన్యంతో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. మధర్ థెరిస్సా వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన స్థానిక ఆర్యవైశ్య ధర్మశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జిల్లెల్ల సీతారాం 45 మంది దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇందుపూరి నారాయణ రావు, నాయకులు మండవిల్లి సాంబశివరావు, మార్కండేయ మూర్తి,బొర్రా రామారావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు జి.సత్యనారాయణ, బి.కాశీరాం నాయక్ అన్నారు. మండలంలోని గుమ్మలో వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. చరవాణిలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా చర్యలు తీసుకుంటామని డ్రైవింగ్ చేసేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, లేనిచో జరిమానాతో పాటు లైసెన్స్‌ను 3నెలలు సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎంవిఐలు

యుటిఎఫ్ కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, నాయకులు బిడ్డిక కూర్మారావు, శ్రీరాములు, పత్తిక ప్రసాదరావు, పత్తిక శంకర్రావు, భాస్కర్‌రావు, చలపతి, వెంకటరమణ, నారాయణరావు, టి శంకర్రావు, కిల్లక రవి, బి.మనోహర్ ఉన్నారు.

సీతానగరం : యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఇఒలు కేలెండర్, డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పల్లె శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు గౌరవాధ్యక్షులు తీళ్ల మధుసూదనరావు, మహిళా సహాధ్యక్షులు కూన లక్ష్మి, ట్రెజరర్ డోకుల వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్రాపు గోవిందరావు, తెర్లి అప్పలనాయుడు, బూరాడ ఆదినారాయణ, మండల కౌన్సిల్ సభ్యులు చుక్క గణపతి, నాగులకొండ త్రినాథ్, గలకట్టు దాలయ్య, వెన్నెల తవిటినాయుడు, దాసరి ఈశ్వరరావు, ఓలేటి గిరిప్రసాద్ పాల్గొన్నారు.

భామిని : స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఇఒ -1,2లు శ్రీనివాసరావు, యు.భాస్కరరావు యుటిఎఫ్ 2025 కేలెండర్, డైరీ, యుటిఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఇ తిరుపతిరావు, కద్రక ప్రసాద్, పూర్వ జిల్లా కార్యదర్శి ఎస్.చంద్రశేఖరరావు, సహాధ్యక్షులు పంటల తిరుపతిరావు, కోశాధికారి బిడ్డిక మహేష్, జిల్లా కౌన్సిలర్లు కె.క్రాంతి కుమార్, బాలదుర్గాప్రసాద్, నాయకులు జి.శ్రీనివాసరావు, బి.మురళీధర్, వెంకట రమణ, హేమంత్, టి.సుందరమ్మ, నులకజోడు, కొరమ, కాట్రగడ,బాలేరు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఎంఇఒలు గౌరునాయుడు, ఆనందరావు యుటిఎఫ్ ప్రచురించిన కేలండర్, డైరీ, స్వర్ణోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.రాజకుమారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బోనంగి దుర్గాప్రసాద్, కురమాన గోవిందరావు, గౌరవ అధ్యక్షులు ఎ.స్వామిబాబు, సహాధ్యక్షులు జెవి సూర్య ప్రకాష్, కోశాధికారి బోనంగి వాసుదేవరావు, రాష్ట్ర కల్చరల్ కమిటీ సభ్యులు కె.గౌరునాయుడు, ఎం. ముకుందరావు, వి.అన్నాజీరావు, ముఖ్య నాయకులు, కార్యవర్గ సభ్యులు, ప్రధానోపాధ్యాయులతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




కేలండర్‌ను ఆవిష్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిఐటియు, ఉపాధ్యాయ సంఘ నాయకులు లక్ష్మి, కమల

సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

నూతన సంవత్సరం సందర్భంగా సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బెలగాంలో గల 20,21వ వార్డుల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.లక్ష్మి, ఉపాధ్యాయ నాయకురాలు కమల మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా సామాజిక స్పృహతోఎల్లప్పుడూ వ్యవహరించాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా ఎదుర్కొనేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళలందరికీ ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన గౌతమి, దీపిక, యామినితో పాటు, పలువురు మహిళలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఫారెస్ట్ రేంజర్ మణికంఠ, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ మురళీధర్‌రావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు కమల సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ వ్యవహరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు సింహాచలం, సుజాత, పద్మ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామ్మూర్తి దంపతులను సన్మానిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రభుత్వ ఉద్యోగులు అందించే ఉత్తమ సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని డిఇఒ ఎన్.తిరుపతినాయుడు పేర్కొన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేసిన దార్ల శ్రీరామమూర్తి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం బుధవారం స్థానిక డిఇఒ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరామ్మూర్తి దంపతులను డిఇఒ దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులకు పదవీ విరమణ అనేది సహజమన్నారు. ఐతే పదవిలో అందించిన ఉత్తమ సేవలే పదవికి, శాఖకు మంచి గుర్తింపును తీసుకు వస్తాయని తెలిపారు. ఉద్యోగరీత్యా కుటుంబసభ్యుల ప్రోత్సాహం అనేది చాలావరకు ఉండాలన్నారు. 35 ఏళ్లుగా వృత్తినే దైవంగా భావించి వివిధ అధికారుల మన్ననలను పొందిన శ్రీరామ్మూర్తికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, విద్యా శాఖ సిబ్బంది పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామకంఠం ఆక్రమణ

ప్రజాశక్తి - పాలకొండ

చోద్యం చూస్తున్న అధికారులు
దర్జాగా నిర్మాణాలు

స్థానిక నగర పంచాయతీలో సర్వే నెంబరు 479/1 ప్రాంతాన్ని గ్రామ కంఠంగా ఉంది. కొంత కాలంగా గ్రామ కంఠానికి రిజిస్ట్రేషన్లు జరగలేదు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామ కంఠం రిజిస్ట్రేషన్లకు అనుమతులిచ్చింది. దీంతో గ్రామ కంఠంలో ఉన్న భూముల్లో అక్రమ కట్టడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతుంది. రెవెన్యూ నగర పంచాయతీ అధికారులు దీనిపై చోద్యం చూస్తున్నారు. దీంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. పట్టణంలో ఇలాంటి నిర్మాణాలు కోకొల్లలు. అడిగిన నాధుడు లేకపోవడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. పట్టణంలో తాజాగా రెల్లివీధి వద్ద అంబేద్కర్ విగ్రహం వెనుక నగర పంచాతీయ స్థలంలో చకచకా నిర్మాణాలు జరిగిపోతున్నాయి. వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపటికీ దర్జాగా నిర్మాణాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ భూమి వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులు మారి క్రయ విక్రయాలు కూడా జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఉన్న నగర పంచాయతీ కమిషనర్ లిల్లీ పుష్పనాథం ఆ స్థలం నగర పంచాయతీ స్థలంగా గుర్తించి సర్వే చేయించి బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డులను కూడా అక్రమార్కులు మాయం చేసి దర్జాగా భవంతులు నిర్మించుంటున్నారు. దీనిపై అధికారులు నోరు మెదపకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావును ప్రజాశక్తి వివరణ కోరగా, అది తమ దష్టిలో లేదని, దీనిని పరిశీలిస్తానని చెప్పారు. అవసరమైతే వార్డు కార్యదర్శులను పంపించి విచారణ చేయిస్తామన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి -భామిని


రామారావు (ఫైల్)

మండలంలోని నేరడి గ్రామానికి చెందిన భీమాసింగి రామారావు (65) మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎన్‌టిఆర్ టిడిపి పార్టీ స్థాపించినప్పటి నుండి టిడిపిలో కొనసాగుతూ టిడిపి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. స్వతహాగా భవన నిర్మాణ కార్మికుడి కావడంతో, ఇతని వద్ద ఎంతో మంది పనిచేసి ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులు కొనసాగుతున్నారు .ప్రస్తుతం భామిని మండలం భవన నిర్మాణ సంఘం అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఈయన మృతి పట్ల పలువురు టిడిపి నాయకులు, భవన నిర్మాణ కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు.

వేడి సాంబారులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన కందికొత్తల ఉత్సవాల్లో పాల్గొని ప్రమాదవశాత్తూ 70 కేజీలు మరుగుతున్న సాంబారు ట్రబ్బులో పడి గాయపడిన నిమ్మల రమేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. 95 శాతం శరీరం కాలిపోవడంతో రమేష్ మృతి చెందాడు. మృతుని స్వగ్రామం గుమ్మలక్ష్మీపురం మండలం చెముడుగూడ. బస్సు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు.

రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జగదీశ్వరి

ఆదివాసీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేడి సాంబార్లో పడి తీవ్ర గాయాలు పాలై మృతి చెందిన నిమ్మల రమేష్ కుటుంబాన్ని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి బుధవారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. రమేష్ మృతి అత్యంత బాధాకరమని అన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, నాయకులు

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాల కార్పొరేషన్లలో ఇంజనీరింగ్ విభాగంలో వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 3న జరుగుతున్న రాష్ట్రవ్యాప్త నిరసనలలో ఇంజనీరింగ్ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.వై నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం సాలూరులో ధర్నాకు సంబంధించిన ప్రచార కరపత్రాలను సాలూరు పట్టణ ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం విడిచిపెట్టిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ హామీలు అమలు చేస్తామని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా నేటికి ఆరు నెలలవుతున్నా చలనం లేదని, ఇప్పటికే మున్సిపల్ యూనియన్ తరుపున ముఖ్యమంత్రికి, పురపాలక శాఖ మంత్రికి పలు దఫాలు విజ్ఞప్తులు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈనెల 3న జరిగే కార్పొరేషన్, మున్సిపల్ పరిధిలో నిర్వహించే ధర్నాలకు ఇంజినీరింగ్ కార్మికుల అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వాటర్ వర్క్స్ యూనియన్ నాయకులు డర్రు సంతోష్ కుమార్, ఉమా, అమర్, కుమార్, దుర్గ, రమణ పాల్గొన్నారు.